క్లుప్తంగా

గుడారి గంగమ్మకు ఆషాఢ పూజలు


కూరగాయల అలంకరణలో అమ్మవారు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని శ్రీ గుడారి గంగమ్మ ఆలయంలో శుక్రవారం ఆషాడపూజలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం చేసి వివిధ రకాల పండ్లు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ అలంకరణ భక్తులకు కనువిందు చేసింది.

వరసిద్ధుని సేవలో సాయిధరమ్ తేజ్


సినీహీరో సాయిధరమ్‌తేజ్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధివినాయక స్వామిని పలువురు ప్రముఖులు శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రి మాలిక్, తెలుగు సినీ హీరో సాయిధరమ్ తేజ్ విడివిడిగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు, సురేష్ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

యు విన్ యాప్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్

యాదమరి: మండల కేంద్రంలోని సంతగేటు ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బందికి యు విన్ యాప్‌పై వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ఉదయం ఏఎన్ఎంలకు, ఆశ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్యశాఖలో గర్భవతులకు, చిన్నారులకు వేస్తున్న వ్యాధి నిరోధక టీకాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం కొత్తగా యు విన్ యాప్‌ను రూపొందించారన్నారు. ఈ యాప్‌లో ముఖ్యంగా గర్భిణుల నమోదు, చిన్నారులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలు, వారికి అందించే సర్వీసెస్‌పై ఎలా నమోదు చేయాలో వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శి సస్పెన్షన్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని 32వ డివిజన్‌లో పారిశుద్ధ్య కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న జి.మోహన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల 32వ డివిజన్‌ను కమిషనర్ తనిఖీ చేయగా, యూజర్ చార్జీలు వసూలు చేసిన మోహన్‌కుమార్, ఈ మొత్తాన్ని కార్పొరేషన్ ఖజానాలో జమ చేయలేదని గుర్తించారు. ప్రజల నుంచి వసూలు చేసిన రూ.1.92 లక్షల యూజర్ చార్జీలను వారం రోజుల్లో కార్పొరేషన్ ఖజానాలో జమచేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పర్యవేక్షణలో లోపం ఉండటంతో ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్యం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ ద్వారా మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్థానిక వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని తడకర, ఉప్పాంక గ్రామాల్లో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు.

దివిటివారిపల్లెలో..

ఐరాల: మండలంలోని దివిటివారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శుక్రవారం ప్రవీణ్‌కుమార్ 104 వైద్య శిబిరంలో 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సచివాలయంతోనే గ్రామ స్వరాజ్యం



చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు సుగుణ. 7వ వార్డు నివాసితురాలు. ఈమెకు దివ్యాంగ పింఛన్ వస్తోంది. తల్లిదండ్రులతో కలిసే ఉంటుంది. ప్రధానంగా వీళ్లకు సొంత ఇల్లు లేదు. బాడుగ ఇంట్లో నెట్టుకొస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇంటి స్థలం కావాలని పలుమార్లు అర్జీలు పెట్టుకున్నా, వీరి గోడు ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సచివాలయం ద్వారా ఇంటిస్థలం కావాలని అర్జీ పెట్టుకున్నారు. అర్జీని పరిశీలించిన అధికారులు, సిబ్బంది వెంటనే అనుపల్లి ప్రాంతంలో ఇంటిస్థలం మంజూరయ్యేలా చూశారు. దీంతో వారి సొంతింటి కల నెరవేరింది.



ఈమె పేరు చంద్రకుమారి. నగరంలోని కొంగారెడ్డిపల్లి భజనగుడిలో కాపురముంటున్నారు. ఒక కుమార్తె ఉంది. టీడీపీ ప్రభుత్వంలో రేషన్‌కార్డు కావాలని పలుమార్లు అర్జీలు పెట్టుకున్నారు. జన్మభూమిలో వినతులు ఇస్తే ఈమె ఎదుటే ఆ అర్జీని చెత్త కుప్పలో పారేశారు. దీంతో విసిగిపోయిన ఈమె ఇక రేషన్‌కార్డు వద్దని చాలించుకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సచివాలయ వ్యవస్థ ప్రారంభమైంది. కొత్త రేషన్‌కార్డు మంజూరుకు అవకాశం కల్పించడంతో వలంటీర్ ద్వారా కార్డుకు దరఖాస్తు పెట్టుకుంది. వారం రోజుల్లో రేషన్ కార్డు మంజూరు చేశారు.

మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా జగనన్న ప్రభుత్వం అడుగులు వేసింది. సచివాలయ వ్యవస్థ గ్రామ స్వరాజ్యానికి చిరునామాగా మారింది. ఒక నవ వసంతం వెల్లివిరిసింది. ప్రజా సమస్యల పరిష్కారానికి సచివాలయం వేదికైంది. దీంతో సమస్యలతోపాటు పలు రకాల సేవలు సులభతరమయ్యాయి. వలంటీర్ల వద్ద దరఖాస్తు చేసుకుంటే సేవలు, పథకాలు ఇళ్లను వెతుక్కుంటూ వస్తున్నాయి. నిర్ణీత సమయంలో పనులు పూర్తవుతున్నాయి. దీంతో నగరవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- వలంటీర్ల ద్వారా సేవలకు దరఖాస్తు
- నిర్ణీత సమయంలో ధ్రువపత్రాలు జారీ
- అందుబాటులోనే ఆధార్ సేవలు


చిత్తూరు సచివాలయంలో సేవలు పొందుతున్న లబ్ధిదారులు


ఆధార్ సేవలందిస్తున్న సచివాలయ ఉద్యోగి


7వవార్డు సచివాలయం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో 50 వార్డులున్నాయి. ఈ వార్డుల పరిధిలో మొత్తం 51 సచివాలయాలు పని చేస్తున్నాయి. ఇందులో 421 సచివాలయ సిబ్బంది, 830 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. తద్వారా 526 రకాల సేవలు అందిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. వార్డు సచివాలయాల ద్వారా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, రేషన్‌కార్డు, హెల్త్‌కార్డు తదితరాలు అందజేస్తోంది. ఇళ్ల స్థలాలు, నిర్మాణాలు ఇక్కడి నుంచే మంజూరవుతున్నాయి. ఇక్కడి సిబ్బంది సంక్షేమ పథకాలకు దరఖాస్తు స్వీకరించి ఫలాలు అందేలా చూస్తున్నారు. ఇంటిపన్ను, టైటిల్ ట్రాన్స్‌ఫర్, ఖాళీ స్థలాలకు ప్లానింగ్ అనుమతులు, కరెంటు బిల్లులు, ఆధార్ నమోదు, సదరన్‌స్లాట్ బుకింగ్‌లు ఊరు దాటకుండానే జరిగిపోతున్నాయి. గడప దాటకుండా ఇంటి వద్ద నుంచే వలంటీర్ల ద్వారా సేవలను పొందుతున్నారు. దరఖాస్తు చేసుకున్న సేవలన్నీ నిర్ణీత సమయంలో తలుపుతుడుతున్నాయి. ఇవన్నీ కూడా పార్టీలు, మతాలు, కులాలకతీతంగా జరుగుతున్నాయి.

నగరంలో ప్రభుత్వ సేవల వివరాలు

సచివాలయాల సంఖ్య –	51
సిబ్బంది –	421
వలంటీర్లు –	830

సేవలు	లబ్ధిదారులు
ఇంటిస్థలాలు	5,630
హౌసింగ్	5,640
రేషన్‌కార్డు మంజూరు	6,361
టౌన్ ప్లానింగ్	3,250
సదరన్ స్లాట్ బుకింగ్	1,002
ఆధార్ సేవలు	6,562
కుల, ఆదాయ ధ్రువపత్రాలు	45,320

నాడు ఎలా అంటే...

టీడీపీ ప్రభుత్వంలో కులధ్రువీకరణ పత్రాలు పొందాలంటే జనం నానా తంటాలు పడేవారు. వీఆర్‌ఓ నుంచి మండల స్థాయి అధికారుల కోసం పట్టణమంతా గాలించేవారు. రోజుల తరబడి వారి సంతకాల కోసం కార్యాలయం ఎదుట పడిగాపులు కాసేవారు. దరఖాస్తు సమర్పించిన నెలకో, రెండు నెలలకో పత్రాలు ఇచ్చేవారు. ఇందుకు రూ.500 నుంచి రూ.1000 వరకు చెల్లించుకోవలసి వచ్చేది. రెండేళ్లకోసారి ఇచ్చే రేషన్‌కార్డులు పొందాలంటే, ముందుగా జన్మభూమి కమిటీ సభ్యులను ప్రసన్నం చేసుకోవాల్సి ఉండేది. అది కూడా టీడీపీ సానుభూతి పరుడిగా ఉంటనే కార్డులు మంజూరయ్యేవి. మిగిలిన దరఖాస్తులను పట్టించుకునేవారు కారు. ఇక చాలా వార్డుల్లో అర్జీలను, కార్డులను చెత్త కుప్పలో పడేసిన సందర్భాలు ఉన్నాయి. అరకొరగా మంజూరైన పక్కా ఇళ్ల నిర్మాణం కూడా టీడీపీ కార్యకర్తలు, నాయకులకు మాత్రమే పరిమితమయ్యేది. సామాన్య జనానికి అప్పటి పథకాలు అందని ద్రాక్షలా మిగిలాయి. నగరపాలక సంస్థలో పన్ను చెల్లింపులు, ఇతరత్రా పత్రాలు పొందేందుకు కష్టాలను అనుభవించారు. తమ్ముళ్ల పెత్తనంతోనే పత్రాలు మంజూరయ్యేవి.

ఇప్పుడు అవస్థలు లేవు



“గతంలో ఏది కావాలన్నా తహసీల్దార్ కార్యాలయం, నగరపాలక సంస్థ కార్యాలయానికి పరుగుతీయాల్సి వచ్చేది. అప్పట్లో పనిగట్టుకుని తిరిగేవాళ్లం. సచివాలయాలు వచ్చాక ఇంటి వద్దే సేవలు అందుతున్నాయి. ఆధార్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పని వదులుకుని తిరగాల్సిన పని లేదు. సచివాలయ వ్యవస్థను గొప్ప ఆలోచనతో సీఎం ప్రవేశపెట్టారు.

– రేణుక, 22వార్డు, చిత్తూరు

ఇంటి వద్దకే వస్తున్నారు



సచివాలయాలు వచ్చాక ఏం కావాలంటూ వలంటీర్లు ఇంటివద్దకే వస్తున్నారు. ఏ అవసరమైనా వారి చేతిలో దరఖాస్తు పెడితే గడువు పూర్తయ్యేలోపు తెచ్చి ఇస్తున్నారు. వైద్య సేవలు, రెగ్యులర్ చెకప్‌లు కూడా సచివాలయంలోని ఏఎన్ఎం ద్వారా చేసుకుంటున్నాం. అవసరమైతే ఇంటి వద్దకే వస్తున్నారు. ఇంటి వద్దే ఉండి సేవలను పొందుతున్నాం.

– ప్రశాంతి, కొంగారెడ్డిపల్లి, చిత్తూరు

పీవీకేఎన్ ప్రిన్సిపల్‌గా జీవనజ్యోతి



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా జీవనజ్యోతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంఎస్సీ, బీఈడీ, ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేసిన జీవనజ్యోతి మన్యం జిల్లా, సీతం పేట నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సమస్యలను పరిష్కరించండి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వం తమ సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని ఎస్‌వీ యూనివర్సిటీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ సెక్రటరీ సురేంద్ర రెడ్డి కోరారు. ఆ అసోసియన్ నాయకులు తమ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం బంద్ నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జీవో 22 ప్రకారం నిర్ణయించిన ఫీజుల నిర్ధారణ పున:పరిశీలించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజులతో కళాశాలలు నడపడం కష్టతరమన్నారు. సమస్యలను ప్రభుత్వం పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

స్వచ్ఛంద పన్నులు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి

చిత్తూరు రూరల్: తమిళనాడు, కర్ణాటక వాహనదారులకు తాత్కాలిక అనుమతి పత్రం, స్వచ్ఛంద పన్నుల చెల్లింపులు ఆన్‌లైన్‌లో ద్వారా మాత్రమే చేయాలని రాష్ట్ర శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు డీటీసీ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పలమనేరు, నరహరిపేట రవాణాశాఖ తనిఖీ కేంద్రాల వద్ద పన్నులు చెల్లించుకోవాలని సూచించారు. నగదు బదిలీలు చేయకూడదని ఆదేశాలు అందించినట్లు చెప్పారు.

నేడు జగనన్న సురక్ష

తవణంపల్లె: మండలంలోని పైమాఘం, పట్నంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాంఆజాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి రుసుం లేకుండా లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు బంగారుపాళెంలో గడపగడపకు మన ప్రభుత్వం

బంగారుపాళెం: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1 పరిధిలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంఈడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

ఉద్యోగుల పే-ఫిక్సేషన్ ఉత్తర్వులు జారీ


కమిషనర్ అరుణ నుంచి వేతన ఉత్తర్వులు అందుకుంటున్న బాలాజీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో ఎన్ఎంఆర్ (నామినల్ మస్టర్ రోల్)గా పని చేస్తూ రెగులర్ అయిన ఉద్యోగులకు పే-ఫిక్స్ చేస్తూ కమిషనర్ అరుణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేషన్‌లో ఎన్ఎంఆర్ ఉద్యోగులను రెగులర్‌గా గుర్తించకపోవడంతో న్యాయపోరాటం చేశారు. దీంతో 2019 జూలైలో పలువురు ఉద్యోగులను రెగులర్‌గా గుర్తిస్తూ, వీళ్ల సర్వీసు ఆధారంగా పే-ఫిక్సేషన్ ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) అధికారులు సైతం కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ఉత్తర్వులు, డీఎంఏ ఆదేశాలను లెక్క చేయని కార్పొరేషన్‌లోని ఒకరిద్దరు అధికారులు వీటిని మూలన పడేశారు. దీంతో మళ్లీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా రెగులర్ కాకమునుపు వస్తున్న వేతనాలను పరిగణనలోకి తీసుకుని పే-ఫిక్సేషన్ చేయాలని గతేడాది ఆగస్టులో కోర్టు మళ్లీ ఆదేశాలు జారీ చేసింది. వీటిని కూడా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఉద్యోగులంతా ఇటీవల కమిషనర్ అరుణను కలిసి విన్నవించారు. కొందరు ఉద్యోగులు తమపై వివక్షతో పే-ఫిక్సేషన్ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. దీంతో కమిషనర్ ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున అడ్వాన్సుగా చెల్లించారు. దీనిపై డీఎంఏ కార్యాలయ ఉన్నతాధికారులతో సంప్రదించిన కమిషనర్, ఉద్యోగులకు 2019 జూలై నుంచి పాత వేతనాల ప్రకారం పే-ఫిక్సేషన్ చేస్తూ ఉద్యోగులకు ఉత్తర్వుల కాపీలను అందచేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్లుగా పనిచేస్తున్న బాలాజీ, గంగాధర్, క్లీనర్ సలీమ్, గ్యాంగ్ మజ్దూర్ ఖాదర్‌బాషా, పారిశుద్ధ్య కార్మికులు ఇలంగోవన్, కుమార్, కార్తికేయన్‌కు నాలుగేళ్ల వేతనాలు ఫిక్స్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో నాలుగేళ్ల నిరీక్షణకు తెరపడింది.

పవన్‌పై కేసు నమోదు చేయాలి


పవన్ కల్యాణ్‌పై సీఐకి ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు

బంగారుపాళెం: ప్రజా సేవ చేస్తున్న వలంటీర్లను సంఘ విద్రోహులతో పోల్చిన పవన్‌కల్యాణ్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై మండల కేంద్రంలో శుక్రవారం చీకూరుపల్లె, సంక్రాంతిపల్లె గ్రామ వలంటీర్లు ఆందోళన చేపట్టారు. స్థానిక గోమతి స్పిన్నింగ్ మిల్ వద్ద నుంచి జాతీయ రహదారి మీదుగా పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. పవన్‌కల్యాణ్‌పై కేసు నమోదు చేయాలంటూ సీఐ నాగరాజరావుకు ఫిర్యాదు చేశారు. వలంటీర్లు మాట్లాడుతూ, సేవాభావంతో ప్రజలకు ప్రభుత్వానికి వారధులుగా ఉంటూ సేవలు అందిస్తున్నామన్నారు. పారీలకతంగా సేవలు అందిస్తున్న వలంటీర్లను సమాజ విద్రోహులుగా చిత్రిస్తూ మాట్లాడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వలంటీర్లను అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేస్తున్న పవన్‌కు మతి భ్రమించిందన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్: చిత్తూరు రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 13 అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ శ్యామ్ సుగుణకుమారి తెలిపారు. ప్రధాన అంగన్‌వాడీ పోస్టులు నగరంలోని మురుగానంపల్లి(ఓసీ జనరల్ కేటగిరి), మంగసముద్రం (ఓసీ జనరల్), గుడిపాల మండలం బొమ్మసముద్రం (ఓసీ జనరల్) పోస్టులు ఖాళీలున్నాయన్నారు. మినీ అంగన్‌వాడీలకు నగరంలోని మున్సిపల్ లైన్ (ఎస్సీ), చిత్తూరు మండలంలోని తాళంబేడు ఎస్టీ కాలనీ(ఎస్టీ), గుడిపాల మండలం బందార్లపల్లి (ఓసీ జనరల్), కైదుగానీ కండ్రిగ (ఓసీ జనరల్), ఆయా పోస్టులకు నగరంలోని సంపత్ నగర్ (ఎస్సీ), తిమ్మసానిపల్లి (ఎస్సీ), శరవణపురం (ఓసీ జనరల్), పాపిశెట్టిపల్లి (ఓసీ జనరల్), 13. గొల్లపల్లి(ఓసీ జనరల్) పోస్టులు భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఈనెల 17వతేదీ నుంచి 22 వరకు చిత్తూరు నగరం ఐటీఐ సమీపంలోని సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రూ.41 వేల జరిమానా

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో వాణిజ్య సర్వీసులను తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.41,700 జరిమానా విధించారు. నగరంలో మొత్తం 40 బృందాలు 1,335 సర్వీసులను తనిఖీలు చేయగా, అందులో 16 మాల్‌ప్రాక్టీసు (గృహా సర్వీసుకు మీటరు తీసుకొని, వాణిజ్యానికి వాడుకోవడం) కేసులను గుర్తించారు. వీరికి రూ.41,700 జరిమానా విధించారు. కార్యక్రమంలో డీఈ శేషాద్రి, ఏఈలు బాలచంద్ర, రాజేంద్రబాబు, మహమ్మద్‌బాషా, కేశవులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై నిఘా


తనిఖీ చేస్తున్న డీఈ శేషాద్రి

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్తు చౌర్యంపై నిఘా ఉంచామని అందులో భాగంగా తరచూ తనిఖీలు చేస్తున్నామని ట్రాన్స్‌కో డీపీ విభాగం డిస్కం(రాయలసీమ, నెల్లూరు జిల్లాలు) ఎస్ఈ రమాదేవి తెలిపారు. ఆమె శుక్రవారం చిత్తూరులోని జిల్లా విద్యుత్ స్టోర్‌ను పరిశీలించారు. మెటీరియల్ క్వాలిటీ, స్టాక్ నిల్వ, వస్తువుల కొలతలను పరిశీలించారు. విద్యుత్ చౌర్యం అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అదనపులోడ్, చౌర్యం, బ్యాక్‌బిల్లింగ్, మాల్‌ప్రాక్టీస్, డైరెక్ట్ ట్యాపింగ్ వంటి అంశాలను తనిఖీలు చేస్తున్నట్లు వివరించారు. మొత్తం 42 మంది సభ్యులతో ఉన్న బృందం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తూ జరిమానాలు విధిస్తున్నట్లు చెప్పారు. ఈఈ పద్మనాభపిళ్లై డీఈ జయప్రకాష్, శేషాద్రి, ఏఈలు కుమార్, వివేకానందరెడ్డి, బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.

రాగి సాగులో మెలకువలపై శిక్షణ తరగతులు



యాదమరి: పెరుమాళ్లపల్లెలో రాగి పంటను పరిశీలిస్తున్న అధికారులు, బంగారుపాళెం: గుంతూరులో రాగిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

యాదమరి: రాగి పంట సాగులో మెలకువలపై ఆర్‌బీకే సిబ్బందికి చిత్తూరు వ్యవసాయశాఖ ఏడీ వై మధుసూదన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన శుక్రవారం మండలంలోని పెరుమాళ్ల పల్లెకు చెందిన రాజారెడ్డి పొలంలో పండించిన రాగి పంటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాగి సాగుపై మొదట ఆర్‌బీకే సిబ్బందికి అవగాహన ఉండాలన్నారు. అందుకోసం విత్తన మోతాదు, సాగు విధానము, ఎరువులు, కలుపు యాజమాన్య పద్ధతులను వివరించారు. మండలంలో 40 ఎకరాల్లో రాగి పంట సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. రైతులు పండించిన రాగులు క్వింటాలుకు రూ.3,800 ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీడీఏ హబీబ్ బాషా, మండల వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అండగా

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని, మండల వ్యవసాయ శాఖాధికారి మధురవాణి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఇందులో ఏఓ మాట్లాడుతూ మండలంలోని ప్రతి రైతు భరోసా కేంద్రంలో రాగులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అవసరమైన రైతులు వారి రైతు భరోసా కేంద్రంలో రాయితీతో పొందవచ్చని సూచించారు. మండల స్థాయి సమావేశాలకు వ్యవసాయ సలహామండలి సభ్యులు తప్పక హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరి, చైర్మన్ కోదండరెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులు రాగి సాగుపై దృష్టి సారించాలి

బంగారుపాళెం: రైతులు రాగి పంట సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఉప వ్యవసాయ సంచాలకులు హబీబ్‌భాషా సూచించారు. మండలంలోని గుంతూరు రైతుబరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఖరీఫ్ 2023 సీజన్‌కుగాను 280 హెక్టార్లలో వరి సాగు చేసేలా ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఆర్‌బీకే సిబ్బంది రైతులను ప్రోత్సహించి రాగిపంట సాగు చేసేలా కృషి చేయాలన్నారు. డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, కౌలురైతులకు రెవెన్యూశాఖ ద్వారా కౌలుదారు ధృవపత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న రాగి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు, విస్తరణాధికారి సాదరయ్య, ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మల్బరీ సాగుతో అధిక లాభం

ఐరాల: రైతులు వాణిజ్య పంటల కన్నా మల్బరీ సాగు చేపట్టడం లాభదాయకమని పట్టు పరిశ్రమ శాఖ సహాయ సంచాలకులు మోహన్‌బాబు అన్నారు. మండలంలోని పుత్రమద్ది రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుజ్జిరెడ్డి ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మోహన్‌బాబు మాట్లాడుతూ పట్టు పరిశ్రమకు ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. ఒక్కసారి మొక్కలు వేస్తే కనీసం 20 ఏళ్ల పాటు ప్రతినెలా ఆదాయం వస్తుందన్నారు. సేంద్రియ పద్ధతుల్లో మల్బరీ సాగు ద్వారా తక్కువ సమయంలో, తక్కువ నీటితో అధిక లాభాలు సాధించవచ్చని తెలిపారు. మల్బరీ యాజమాన్య పద్ధతులు, చాకీ పద్ధతిలో పట్టు పురుగుల పెంపకం గురించి అవగాహన కల్పించారు. రైతులు మల్బరీ సాగుపై దృష్టి సారించాలన్నారు. ఏఓ వరలక్ష్మి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరి, వేరుశనగలో చీడ, పీడల నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రైతులు రాగి పంట సాగుపై దృష్టి సారించాలన్నారు. ఉద్యాన సహాయకులు రామచైతన్య మాట్లాడుతూ మామిడి రైతులు కోత తర్వాత సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా వచ్చే ఏడాది సక్రమంగా పూత రావడంతో పాటు అధికదిగుబడులు పొందడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సెరికల్చర్ టీఏ గణేష్, వీఎస్ఏ గణేష్ తదితరులు పాల్గొన్నారు.



పూతలపట్టు : సమావేశంలో పాల్గొన్న అధికారులు, ఐరాల: అవగాహన కల్పిస్తున్న మోహన్‌బాబు

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కండి

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాల్లో నగర ప్రజలందరూ భాగస్వాములు కావాలని నగర కమిషనర్ అరుణ పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2023 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చేపల మార్కెట్ వద్ద ప్రత్యేక పరిశుభ్రతా కార్యక్రమాలను చేపట్టారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి సహకారంతో చేపల మార్కెట్లో అపరిశుభ్రంగా ఉన్న గోడలను శుభ్రం చేసి పెయింట్ వేయించారు. దీంతో చేపల మార్కెట్ పరిసరాలు సరికొత్త రూపు సంతరించుకున్నాయి. కమిషనర్ అరుణ మాట్లాడుతూ, మార్కెట్లో వ్యర్థాలను తడిగా, పొడిగా వేరు చేసి కార్మికులకు ఇవ్వాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్- 2023 సిటిజన్ ఫీడ్ బ్యాక్ పై అవగాహన కల్పించి వారి చేత ఓటింగ్ చేయించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై కళాజాత ఆకట్టుకుంది. క్లాత్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఓసీఎల్ చిత్తూరు టర్మినల్ మేనేజర్ మురుగన్, కార్పొరేటర్లు అశోక్, ఎంహెచ్‌వో లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకనాథం, నరసింహ, వార్డ్ కార్యదర్శులు, వైఎస్సార్ సీపీ నేత అల్తాఫ్, వ్యాపారస్తులు పాల్గొన్నారు.


చేపల మార్కెట్‌ను పరిశీలిస్తున్న కమిషన్ అరుణ